## క్లుప్తంగా

### సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



ఎంఈఓ-2 జనార్ధన్‌గౌడ్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

**బేతంచెర్ల:** ఉత్తమ పౌరులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బుగ్గన ప్రసన్నలక్ష్మి, మాజీ ఎంపీటీసీ ప్రభాకర్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని అమ్మవారిశాలలో ఎంఈఓ-2 జనార్ధన్‌గౌడ్ పదవీ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఉపాధ్యాయులు, ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ సభ్యులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈఓ-1 సోమశేఖర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మరియదాసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### శిక్షణ తరగతుల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



పీడీఎస్‌యూ వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న సంఘం నాయకులు

**బేతంచెర్ల:** అనంతపురంలో సెప్టెంబర్ 2వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు జరిగే పీడీఎస్‌యూ (ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ స్టూడెంట్స్ యూనియన్) శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆ సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షుడు పవన్ కోరారు. శనివారం పట్టణంలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. విద్యార్థి సంఘం నాయకులు సోహైల్, మున్నా, నవీన్, విజయ్ పాల్గొన్నారు.

### కస్తూర్బా పాఠశాల తనిఖీ



వివరాలు తెలుసుకుంటున్న ప్రత్యేకాధికారి శ్రీనివాసయాదవ్

**కొలిమిగుండ్ల:** స్థానిక కస్తూర్బా బాలికల పాఠశాలను శనివారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డితో కలిసి మండల ప్రత్యేకాధికారి, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ శ్రీనివాసయాదవ్ తనిఖీ చేశారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. బిల్డింగ్‌పై ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్‌కు మెట్లు ఏర్పాటు చేసుకుని తరచూ శుభ్రం చేయించాలని పేర్కొన్నారు. విద్యార్థినులకు నాణ్యమైన ఆహారం అందించాలని ఆదేశించారు. తరగతి గదులు, వంట గదులు కలియ తిరిగి పరిసరాలను పరిశీలించారు.

### వాహనాల వేలంలో రూ.1.86 లక్షల ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న సీఐ

**డోన్ రూరల్:** వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు పట్టణంలోని సెబ్ కార్యాలయంలో శనివారం వేలం పాట నిర్వహించారు. మొత్తం 7 వాహనాలకు రూ.1,86,440 వచ్చినట్లు సెబ్ సీఐ జయనాథ్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ సోమశేఖర్‌రావు, సెబ్ సిబ్బంది ఉన్నారు.

### పెద్దరాజుస్వామి ఉరుసు ప్రారంభం



విద్యుత్ దీపాలంకరణలో దర్గా

**బేతంచెర్ల:** మండల పరిధిలోని గూటుపల్లె గ్రామంలో పెద్ద రాజుస్వామి ఉరుసు శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా దర్గాను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉత్సవాలను పురస్కరించుకుని పెద్దరాజుస్వామిని ప్రత్యేక పుష్పాలంకరణలో ఉంచారు. ఉదయం నగరాతో ఉరుసును దర్గా పీఠాధిపతి గురు సయ్యద్ అక్బర్ బాషా ఖాద్రి ప్రారంభించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ డి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

### నేడు వీహెచ్‌పీ షష్టి వసంతోత్సవం

**డోన్ టౌన్ :** విశ్వ హిందూ పరిషత్ 60 వసంతాల (షష్టి) కార్యక్రమంలో ప్రతి హిందువు పాల్గొని విజయవంతం చేయాలని డోన్ కార్యదర్శి రామా రాజేష్ కోరారు. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం వసంతోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి వసంతోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

# లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం



పోలీసు అధికారులకు సూచనలు చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి తంగమణి,



ఖైదీలను ఉద్దేశించి మాట్లాడుతున్న జడ్జి తంగమణి

**డోన్ టౌన్:** దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులకు లోక్ అదాలత్‌లో సత్వర పరిష్కారం లభిస్తుందని సీనియర్ సివిల్ జడ్జి తంగమణి అన్నారు. శనివారం డోన్ కోర్టు భవనంలో అడిషనల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జ్యోతితో కలిసి పోలీసు అధికారులు, బార్ కౌన్సిల్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సెప్టెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. సివిల్, క్రిమినల్ కేసుల పరిష్కారానికి రాజీయే ఉత్తమ మార్గం అన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోలీస్ అధికారులు, న్యాయవాదులు ఆయా పోలీస్ స్టేషన్లలో ఉన్న పెండింగ్ కేసులపై కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో సీఐలు ఇంతియాజ్‌బాషా, రాకేష్, వెంకట్రామిరెడ్డి, బార్ కౌన్సిల్ అధ్యక్షుడు వేణుగోపాల్ గౌడ్, ఐఎఎల్ రాష్ట్ర కార్యదర్శి రాగుల రాముడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివరామకృష్ణ, న్యాయవాదులు శేషశయనరావు, గోపాల్‌రెడ్డి, కృష్ణమూర్తి, రాఘవేంద్రగౌడ్, నాగరాజు గౌడ్, శ్రీనివాసులు, బాలరంగడు, మనోహర్ పాల్గొన్నారు.

**సబ్ జైల్ తనిఖీ**

పట్టణ పోలీస్‌స్టేషన్ సమీపంలోని సబ్ జైలును సీనియర్ సివిల్ జడ్జి తంగమణి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీలతో సమావేశం నిర్వహించారు. జైలులోని పరిస్థితులు, వసతులు, భోజన సదుపాయాలపై ఆరా తీశారు. క్షణికావేశంలో చేసిన తప్పులను తెలుసుకుని ఇకనైనా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. స్వతహాగా న్యాయవాదిని నియమించుకోలేని వారికి ప్రభుత్వమే ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తుందని తెలిపారు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత గొడవలకు దూరంగా ఉంటూ కుటుంబంతో హాయిగా జీవించాలని సూచించారు. సబ్ జైలు సూపరింటెండెంట్ రఘునాథరెడ్డి ఉన్నారు.

# నిజాయితీగా పనిచేస్తే ఆత్మసంతృప్తి





ప్రిన్సిపాల్ దంపతులను సన్మానిస్తున్న అధికారులు, రవిశేఖర్ దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

**డోన్:** విధి నిర్వాహణలో అంకిత భావం, నీతి నిజాయితీతో పని చేస్తే ఆత్మ సంతృప్తి కలుగుతుందని పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా, మండల విద్యాధికారులు ప్రభాకర్, రామనర్సప్ప అన్నారు. స్థానిక ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నాగ జాస్మిన్ శనివారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జాస్మిన్ ప్రిన్స్‌పాల్‌గా ఉన్న రెండేళ్లలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారులు స్నేహలత, శ్యామ్యూల్ పోల్, రోటరీ క్లబ్, ఇన్నర్‌వీల్ క్లబ్, విద్యార్థి సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దేది ఉపాధ్యాయుడే**

**డోన్ టౌన్:** విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దేది ఉపాధ్యాయుడేనని మండల విద్యాధికారులు ప్రభాకర్, రామనర్సప్ప అన్నారు. పట్టణంలోని పాతపేట జెడ్పీ హైస్కూల్లో బయాలజీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న రవిశేఖర్ పదవీ విరమణ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలో ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందిగా అభివర్ణించారు. అనంతరం రవి శేఖర్ దంపతులను పట్టుశాలువ, పూలమాలలు, మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. హెచ్‌ఎం పద్మావతి, ఉపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి, వెంకటరమణ, లక్ష్మయ్య, బాబు, వెంకటలక్ష్మి, శ్రీనివాసులు, సుబ్బరాయుడు, లీలావతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పింఛన్.. పరేషాన్



దేవరబండ గ్రామంలో టీడీపీ నేత, మాజీ ఎంపీపీ ఇంటి వద్ద పింఛన్లు పంపిణీ చేస్తున్న సిబ్బంది

**డోన్:** పింఛన్ లబ్ధిదారులు మళ్లీ పాత కష్టాలను అనుభవిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఠంచనుగా ఇంటి వద్దే వలంటీర్ల ద్వారా పింఛన్లు అందుకున్నారు. అయితే టీడీపీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల నుంచి పింఛన్లు తీసుకోవడంలో పడరాని పాట్లు పడుతున్నారు. సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారుల ఇళ్ల వద్దే పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉన్నా టీడీపీ నాయకుల ఒత్తిళ్లతో ఆ పార్టీ నాయకుల ఇళ్ల వద్ద పంపిణీ చేస్తున్నారు. తమ సొంత డబ్బులు లబ్ధిదారులకు చెల్లిస్తున్నట్లుగా ఫొటోలకు ఫోజులిస్తున్న టీడీపీ నాయకుల వ్యవహారాన్ని చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారు. శనివారం పింఛన్ల పంపిణీ ప్రారంభం కాగా డోన్ మండలం దేవరబండలో టీడీపీ నేత, మాజీ ఎంపీపీ ఇంటి వద్ద పంపిణీ చేశారు. డోన్ 31వ వార్డులో టీడీపీ నేత ఇంటి వద్దే పింఛన్లు పంపిణీ చేయడంపై లబ్ధిదారులు పెదవి విరుస్తున్నారు.

**పింఛన్ల పంపిణీ చేసిన మంత్రి బీసీ**

**బనగానపల్లె రూరల్:** మండలంలోని ఇల్లూరుకొత్తపేట గ్రామంలో మంత్రి బీసీ జనార్దర్‌రెడ్డి సామాజిక పింఛన్లన పంపిణీ చేశారు. కాగా గ్రామాల్లో టీడీపీ నాయకుల చేతుల మీదుగా పింఛన్లు పంపిణీ చేయడంపై లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రచారంపై ఉన్న ధ్యాస ప్రజా సమస్యలు, సూపర్‌సిక్స్ అమలుపై పెడితే బాగుంటుందని పేర్కొంటున్నారు. మండలంలో మొత్తం 12,511 మంది లబ్ధిదారులు ఉండగా 94 శాతం పంపిణీ చేసినట్లు మండల ఇన్‌చార్జీ ఎంపీడీఓ నాగరాజు తెలిపారు.

**డోన్‌లో 97.59 శాతం పంపిణీ**

**డోన్ టౌన్:** డోన్ మున్సిపాలిటీలో 97.59 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు కమిషనర్ జయరామ్ తెలిపారు. తారకరామనగర్, కొండపేట కాలనీల్లో లబ్ధిదారులకు ఆయన పింఛన్లు పంపిణీ చేశారు.

**పింఛన్ల కోసం పాట్లు**

**కొలిమిగుండ్ల:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పింఛన్ సొమ్ము తీసుకునేందుకు లబ్ధిదారులు ప్రతి నెలా పడరాని పాట్లు పడుతున్నారు. గ్రామ సచివాలయ సిబ్బందితో ఇంటింటికీ పంపిణీ చేయిస్తున్నామని చెబుతున్నా మాటలకే పరిమితమైంది. మండలంలో శనివారం తెల్లవారుజాము నుంచి చిరుజల్లులు పడుతునే ఉన్నాయి. పింఛన్ కోసం లబ్ధిదారులు కష్టాలు పడాల్సి వచ్చింది. గ్రామాల్లో కొద్ది మందికే ఇళ్ల వద్ద పింఛన్లు అందించారు. అధిక భాగం వీధుల్లో ఒక చోట, చెట్ల కింద.. చావిళ్ల వద్ద కూర్చుని పంపిణీ చేశారు. కొలిమిగుండ్ల రెండో గ్రామ సచివాలయంలోనే పింఛన్లు పంపిణీ చేయడంతో లబ్ధిదారులు సుదూరం నుంచి వర్షంలోనే అవస్థలు పడుతూ చేరుకోవాల్సి వచ్చింది. వృద్ధులు తమ కుటుంబ సభ్యుల సాయంతో బైక్‌లపై వచ్చి తీసుకున్నారు. సిబ్బంది వద్ద బయోమెట్రిక్ పరికరాలు లేకపోవడంతో ఎక్కువ భాగం సెల్‌ఫోన్లలో ఐరిస్ తీసుకుని పింఛన్ అందించారు.

# ఫ్యాక్టరీ యజమానులు జాగ్రత్తలు పాటించాలి

**అవుకు:** మండల పరిధిలోని గనులు, ఫ్యాక్టరీ యజమానులు తగు జాగ్రత్తలు పాటించాలని ట్రాన్స్‌కో ఏఈ పక్కీరయ్య సూచించారు. యజమానులు విద్యుత్ లోడ్‌కు తగినట్లు కెపాసిటర్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ట్రాన్స్‌ఫారం వద్ద హెచ్‌జీ ఫ్యూజ్ సెట్, ఎల్‌టీ ఫ్యూజ్ బోర్డ్, లోడ్‌కు తగినంత ఎంసీబీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ట్రాన్స్‌ఫారం వద్ద ఎప్పటికప్పుడు ఎర్త్‌పైప్స్, జీఐ వైర్‌లు సరిచూసుకోవడంతో పాటు ఎర్త్‌పైప్స్ వద్ద నీళ్లు పోయేలా, గనుల్లోకి పోయే ఎల్‌టీ కేబుల్స్ డ్యామేజ్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే కార్మికులు తప్పనిసరిగా బూట్లు, గ్లౌజులు వాడాలని తెలిపారు. ట్రాన్స్‌ఫారం చుట్టూ చెట్లు, చెత్త లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యుత్ లోడ్‌ను పరిమితికి మించి వాడరాదని, అలా వాడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యుత్ వినియోగంలో ఎలాంటి సమస్యలు వచ్చినా సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

# వైభవంగా వరద పాయసం మహోత్సవం





డోన్: ప్రత్యేక అలంకరణలో లక్ష్మీవేంకటేశ్వరుడు, పాలుట్ల రంగస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

**డోన్ రూరల్:** మండల పరిధిలోని ఆవులదొడ్డి కొండపైన వెలసిన శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం వరద పాయసం మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు మేళతాళాలతో గ్రామం నుంచి స్వామి వారిని ఊరేగింపుగా కొండపైకి తీసుకొచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

**పాలుట్ల రంగస్వామి ఆలయంలో..**

**బేతంచెర్ల:** మండలంలోని గూటుపల్లెలో వెలసిన పాలుట్ల రంగస్వామి ఆలయంలో శ్రావణ మాస చివరి శనివారం సందర్భంగా వరద పాయసం కార్యక్రమం నిర్వహించారు. ఆర్‌ఎస్ రంగాపురం మాజీ సర్పంచ్ జగన్ మోహన్ రెడ్డి, ఆలయ అర్చకుడు విష్ణువర్ధన్ ఆచార్యులు శ్రీదేవి, భూదేవి సమేత పాలుట్ల రంగస్వామి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ఏటా వరదపాయసం పోస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

### బనగానపల్లెలో 28.8 మి.మీ వర్షపాతం

**బనగానపల్లె:** మండలంలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు 28.8 మి.మీ వర్షపాతం నమోదైంది. వర్షం వల్ల వరినాట్లతో పాటు మొక్కజొన్న, మిరప పంటలకు ఉపయోగకరంగా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.

**అవుకులో మోస్తరు వర్షం**

**అవుకు:** బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా అవుకులో శుక్రవారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. శనివారం ఉదయం నుంచి చిరుజల్లులు కురుస్తున్నాయి. అవుకు మండలంలో 8.2 మి.మీ వర్షపాతం నమోదైందని వ్యవసాయ అధికారులు తెలిపారు. పంటలకు ఎలాంటి ఇబ్బందులు లేవని, ఈ వర్షాల వల్ల వరి పంటలు సాగు చేసిన రైతులకు ఎంతో ఉపయోగకరమని వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు.

### 9న నందవరంలో బహిరంగ వేలాలు

**బనగానపల్లె రూరల్:** మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీచౌడేశ్వరిదేవి ఆలయంలో ఈ నెల 9వ తేదీ బహిరంగ వేలాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ శనివారం తెలిపారు. టెంకాయల అంగడి, క్యాంటిన్, కూల్‌డ్రింక్, కిరాణం దుకాణాలను నిర్వహించుకునేందుకు బహిరంగ వేలాలను నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి కలిగిన వారు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

### సారా స్వాధీనం.. ముగ్గురిపై కేసు

**కొలిమిగుండ్ల:** మండలంలోని పలు గ్రామాల్లో శనివారం నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. అవుకు మండలం కొండమ నాయినపల్లెకు చెందిన పెనుగొండ బాలన్న, నాయినపల్లెకు చెందిన సుబ్బరాయుడు బైక్‌పై 40 లీటర్ల సారా తీసుకెళుతుండగా పెట్నికోట వద్ద అదుపులోకి తీసుకున్నామన్నారు. అలాగే చింతలాయిపల్లెలో మల్లలమ్మ కట్ట వద్ద తలారి శ్రీరాములు సారా విక్రయిస్తుండగా దాడి చేసి 20 లీటర్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. రెండు చోట్ల జరిపిన దాడుల్లో 60 లీటర్లు స్వాధీనం చేసుకుని బైక్‌తో పాటు ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

### ఆలయంలో క్యూలైన్ ఏర్పాటు

**కొలిమిగుండ్ల:** కోర్నపల్లె సమీపంలోని గుండం ఆంజనేయస్వామి ఆలయంలో అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన భక్తుడు అంకిరెడ్డి రూ.70 వేలు వెచ్చించి శనివారం స్టీల్ పైపులతో క్యూలైన్ ఏర్పాటు చేయించారు. కార్తీక మాసంతో పాటు ఇతర ముఖ్యమైన పండుగ రోజుల్లో స్వామిని దర్శించుకునేందుకు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. క్యూలైన్ లేకపోవడంతో చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడుతుండేవారు. భక్తుల సౌకర్యం కోసం క్యూలైన్ నిర్మించిన దాత అంకిరెడ్డిని ఆలయ నిర్వాహకులు అభినందించారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

**కోవెలకుంట్ల:** మండలంలోని కంపమల్ల మెట్ట సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడ్డాడు. శనివారం ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి అందించిన సమాచారం మేరకు.. బనగానపల్లె మండలం పలుకూరు గ్రామానికి చెందిన వేణుగోపాల్, లక్ష్మిదేవి ట్రాక్టర్‌లో ఆళ్లగడ్డ వైపు వెళుతుండగా ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ప్రమాదంలో వేణుగోపాల్ గాయపడగా చికిత్స నిమిత్తం కోవెలకుంట్ల ఆస్పత్రిలో చేర్పించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్ సుబ్రమణ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

### సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వైద్యులతో సమీక్షిస్తున్న పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకుడు రమణయ్య

**కోవెలకుంట్ల:** వర్షాకాలం కావడంతో పశువులకు సోకే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధకశాఖ ఆళ్లగడ్డ ఉప సంచాలకుడు డాక్టర్ డీవీ రమణయ్య సూచించారు. శనివారం స్థానిక పశు సంవర్ధకశాఖ ఏడీ కార్యాలయంలో కోవెలకుంట్ల, కలుగొట్ల, గోస్పాడు, యాళ్లూరు, నెహ్రూనగర్ పశువైద్యశాలల డాక్టర్లు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువులకు సోకే గాలికుంటు, బ్రూసెల్లా వ్యాధి నివారణ టీకాల ప్రక్రియను వేగవంతం చేసి నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలని తెలిపారు. సమావేశంలో ఏడీ వీరబ్రహ్మం, పశువైద్యాధికారులు కృష్ణకుమార్, కిషోర్‌కుమార్ రెడ్డి, ఉమాదేవి, అభిలాష్‌రెడ్డి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

# ఉద్యాన పంటల్లో జాగ్రత్తలు అవసరం



టమాట పంటను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి కళ్యాణి

**డోన్ రూరల్:** భారీ వర్షాలతో పొలాల్లో నీరు నిల్వ చేరి తెగుళ్లు ఆశించే అవకాశం ఉందని.. ఉద్యాన రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యాన అధికారి కళ్యాణి రైతులకు సూచించారు. శనివారం మండల పరిధిలోని ధర్మవరం గ్రామంలో రైతులు సాగు చేసిన ఉల్లి, టమాట, చామంతి పంటలను ఆమె పరిశీలించారు. అనంతరం రైతలతో మాట్లాడుతూ.. వర్షాలు ఆగిన వెంటనే అంతర సేద్యం చేసి కలుపును తొలగించాలన్నారు. అలాగే నేల త్వరగా ఆరేలా చేసుకోవాలన్నారు. పొలంలో నీరు నిల్వ ఉండడం వల్ల తెగులు ఆశించే అవకాశం ఉందన్నారు. టమాటలో ఆకు మచ్చ తెగులు ఆశిస్తే మందులు పిచికారీ చేసుకోవాలని సూచించారు. సందేహాలు ఉంటే ఉద్యానశాఖ అధికారులను సంప్రదించాలన్నారు.

# అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు



పదవీ విరమణ పొందిన లక్ష్మీదేవిని సన్మానిస్తున్న వైద్యాధికారులు

**కోవెలకుంట్ల:** ప్రభుత్వ ఉద్యోగులు అంకిత భావంతో పనిచేసినప్పుడే తగిన గుర్తింపు లభిస్తుందని పశు సంవర్ధకశాఖ కోవెలకుంట్ల ఏడీ వీరబ్రహ్మం అన్నారు. ఏడీ కార్యాలయ పరిధిలోని సాంబవరం గ్రామీణ పశువైద్యశాలలో అటెండర్‌గా పనిస్తున్న లక్ష్మీదేవి శనివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీ, పదవీ విరమణ సర్వ సాధారణమన్నారు. అనంతరం ఆమెకు సన్మానించారు. పశువైద్యాధికారులు కృష్ణకుమార్, కిషోర్‌కుమార్‌రెడ్డి, ఉమాదేవి, అభిలాష్‌రెడ్డి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

### వర్షంలోనూ పారిశుద్ధ్య పనులు



అవుకులో పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు

**అవుకు:** మండలంలో రెండు రోజుల నుంచి తేలికపాటి వర్షాలు కురుస్తున్నాయి. ప్రజారోగ్యంలో ప్రధాన పాత్ర వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు వర్షాలను సైతం లెక్కచేయకుండా వారి విధులు నిర్వహించారు. శనివారం వేకువజాము నుంచి వర్షం కురుస్తుండడంతో అవుకు మేజర్ గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు తలకు ప్లాస్టిక్ కవర్‌లను ధరించి వీధులను శుభ్రం చేశారు. పేరుకుపోయిన చెత్తను తొలగించారు.

# భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణుడి గ్రామోత్సవం



శ్రీకృష్ణుడి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

**కోవెలకుంట్ల:** శ్రీకృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకుని శ్రీకృష్ణుడి విగ్రహంతో శనివారం గ్రామోత్సం నిర్వహించారు. పట్టణంలోని ఎస్‌ఎల్‌వీ సినిమా థియేటర్ సమీపంలో ప్రభోద సేవా సమితి ఆధ్వర్యంలో గత నెల 26వ తేదీ శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆరు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి చివరి రోజు విగ్రహాన్ని పట్టణంలోని పురవీధుల మీదుగా ఊరేగించారు. ముదిగేడు చౌరస్తా, ఆర్టీసీ బస్టాండ్, గ్రామ పంచాయతీ సర్కిల్, జమ్మలమడుగు చౌరస్తా మీదుగా ఊరేగింపు సాగింది. పట్టణంలోని ఆయా కాలనీలకు చెందిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

### మద్యం స్వాధీనం.. వ్యక్తి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు, నిందితుడిని చూపిస్తున్న పోలీసులు

**కోవెలకుంట్ల:** మండలంలోని భీమునిపాడు గ్రామంలో బెల్టు షాపు ద్వారా మద్యం విక్రయిస్తున్న బాబు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేశామన్నారు. నిందితుడి నుంచి 25 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

**మద్యం కేసులో వ్యక్తి అరెస్టు**

**బనగానపల్లె:** మండలంలోని నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామతీర్థం గ్రామంలో దేవర సుబ్బారావు అనే వ్యక్తిని మద్యం కేసులో అరెస్టు చేసినట్లు ఎస్ వెంకటసుబ్బయ్య శనివారం తెలిపారు. గ్రామంలో మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో అతన్ని అదుపులోకి తీసుకుని 20 మద్యం బాటిళ్లు, నాటుసారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# గోడౌన్ నిండా అనుమానాలే!

- వెంగళాంపల్లి వద్ద గోడౌన్‌లో మందుల తయారీపై అనుమానాలు
- మత్స్య, వ్యవసాయశాఖ అధికారుల పరిశీలన



డ్రమ్ముల్లో నిలువ ఉంచిన ద్రవాన్ని పరిశీలిస్తున్న అధికారులు

**ప్యాపిలి:** మండల పరిధిలోని వెంగళాంపల్లి రోడ్డు వద్ద ఓ గోడౌన్‌లో తయారవుతున్నది నకిలీ ఆక్వా దాణానా.. లేక నకిలీ క్రిమిసంహారక మందులా.. అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గురువారం అర్ధరాత్రి వెంగళాంపల్లి రోడ్డుపై ఓ ఆటోలో మందుల బస్తాలు లోడింగ్ చేస్తుండగా ప్యాపిలి సీఐ వెంకటరామిరెడ్డి తనిఖీలు నిర్వహించారు. అనుమానం రావడంతో గోడౌన్‌లో కూడా తనిఖీలు చేపట్టి వివరాలు ఆరా తీయగా పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. రాయలచెరువుకు చెందిన విక్రమ్ అనే వ్యక్తి గత కొద్ది రోజులుగా ఇక్కడ గోడౌన్‌ను అద్దెకు తీసుకుని మందులు తయారు చేస్తున్నాడు. సదరు గోడౌన్‌లోని డ్రమ్ములలో నిల్వ ఉంచిన ద్రవపదార్థం గురించి నిర్వాహకులను సీఐ ప్రశ్నించగా వారు డ్రమ్ముల్లో గోమూత్రం నిలువ ఉంచినట్లు సమాధానం ఇచ్చారు. అలాగే బస్తాల్లో ఉన్న పదార్థాన్ని చేపల దాణాగా తెలిపిన వారు ఈ పదార్థాన్ని ఆక్వా రైతులకు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. దీంతో సీఐ మత్స్యశాఖ, వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు మత్స్య శాఖ ఏడీఓ సంధ్యారాణి, ఎఫ్‌డీఓ పామన్న, వ్యవసాయశాఖ అధికారి రాజేశ్ అక్కడికి చేరుకుని డ్రమ్ముల్లో ఉన్న ద్రవపదార్థాన్ని పరిశీలించి గోమూత్రం కాదని తేల్చారు. బస్తాల్లో నిలువ ఉన్న పదార్థం కూడా చేపల దాణా కాదని స్పష్టం చేశారు. వీటిని పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపినట్లు వ్యవసాయాధికారి తెలిపారు. ల్యాబ్ నుంచి ఫలితాలు వచ్చిన తర్వాత తయారవుతున్న మందులపై స్పష్టత వస్తుందన్నారు. మందుల తయారీకి, చేపల దాణా తయారీకి నిర్వాహకులకు సంబంధిత శాఖల అధికారుల నుంచి అనుమతులు లేవన్నారు.